సాక్షి
ఖమ్మం

శుక్రవారం । 14 । మార్చి । 2025



పూర్వ వీఆర్‌ఓల్లో ఆశలు

భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చి పూర్వ వీఆర్‌ఓలను బాధ్యతల్లోకి తీసుకుంటారనే ప్రచారంతో వారిలో ఆశలు మొదలయ్యాయి. 8లో

ఇఫ్తార్ (శుక్రవారం సా॥) 6.24

సహర్ (శనివారం ఉ॥) 5.01

రంజాన్ వేళలు

గరిష్టం / కనిష్టం 41°/ 21°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం గరిష్టస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. ఉదయం నుంచే ఎండ మొదలై గంటగంటకూ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఒంటి పూట బడులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధి పాఠశాలలు ఈనెల 15వ తేదీ శనివారం ఒకటే పూట కొనసాగనున్నాయి. ఎండ తీవ్రత నేపథ్యాన ఈ నిర్ణయం తీసుకోగా, అన్ని పాఠశాలల్లో అమలుచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.సోమశేఖరశర్మ సూచించారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని, ఆతర్వాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. కాగా, పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేస్తున్న పాఠశాలలలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని సూచించారు.

16న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 16న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. అండర్-14, 16, 18, 20, పురుషులు మహిళల విభాగాల్లో 100, 400, జావెలిన్‌త్రో అంశాల్లో పోటీలు ఉంటాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

15వ బెటాలియన్ కమాండెంట్‌గా పెద్దబాబు



ఎన్.పెద్దబాబు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా ఎన్.పెద్దబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. యాపలగడ్డలోని రెండో బెటాలియన్ నుంచి బదిలీపై వచ్చిన ఆయనకు అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.శ్రీధర్ రాజు, ఎస్‌డీ రంగారెడ్డి, అధికారులు స్వాగతం పలికారు. 1991వ బ్యాచ్‌కు చెందిన పెద్దబాబు యాపలగడ్డలోని రెండో బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా కమాండెంట్‌గా పదోన్నతి కల్పించి గంగారం బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ కమాండెంట్‌గా ఉన్న పీజేపీసీ.చటర్జీ హైదరాబాద్‌లోని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌కు బదిలీ అయ్యారు.

హోలీ సందర్భంగా ఆంక్షలు

ఖమ్మంక్రైం: చిన్నాపెద్ద తేడా లేకుండా జిల్లా వాసులు శుక్రవారం హోలీ పండుగ జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, పండుగను సంబురంగా జరుపుకునే క్రమాన ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిటీ పోలీస్ యాక్ట్ ద్వారా శుక్రవారం ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆంక్షలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలే తప్ప రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వ్యవహరిస్తే వాహనాలు సీజ్ చేస్తామని పేర్కొన్నారు. పరిచయం లేని వ్యక్తులపై రంగులు చల్లినా, గొడవలు సృష్టించినా చర్యలు తప్పవన్నారు. అలాగే, ప్రధాన కూడళ్లు, సాగర్ కెనాల్, మున్నేరు, ఇతర రిజర్వాయర్ల వద్ద బందోబస్తు ఉంటుందని తెలిపారు. అంతేకాక కమిషనరేట్ పరిధిలోని కల్లు దుకాణాలు, వైన్స్ బార్లలో సాయంత్రం 6గంటల వరకు మద్యం అమ్మకాలపై నిషేధం ఉన్నందున షాపులు తెరిస్తే చర్యలు తీసుకుంటామని సీపీ వెల్లడించారు.

విధుల్లోకి జూనియర్ లెక్చరర్లు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల జూనియర్ లెక్చరర్లుగా ఎంపికైన వారికి ఇటీవల హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందజేశారు. ఇందులో జిల్లాకు 57మంది లెక్చరర్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు వీరంతా విధుల్లో చేరుతున్నారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. లెక్చరర్ల రాకతో కళాశాలల్లో సబ్జెక్ట్ అధ్యాపకుల కొరత తీరనుందని పేర్కొన్నారు.

జిల్లా కోర్టులో సౌర విద్యుత్

ఖమ్మం లీగల్: జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్యానళ్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగంపై అందరూ దృష్టి సారించాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించినట్లవుతుందని తెలిపారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కోర్టులో సౌర విద్యుత్ వినియోగానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారి హరికృష్ణ, ఉద్యోగులు రాధేశ్యామ్, ఓంకార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాస్, చింతనిప్పు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చేతికి రాగానే కొనుగోళ్లు !



కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేస్తున్న సిబ్బంది (ఫైల్)

వచ్చే నెల 1నుంచి యాసంగి ధాన్యం సేకరణ

- 344 కేంద్రాల ద్వారా 25.84 లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు అంచనా
- ఇందులో సన్నరకాలే.. 18.53లక్షల క్వింటాళ్లు
- ఏర్పాట్లలో నిమగ్నమైన పౌరసరఫరాల సంస్థ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఈ యాసంగి రైతులు సాగు చేస్తున్న ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. వచ్చే నెల 1నుంచి జిల్లాలో కొనుగోళ్లు మొదలుకానుండగా 344 కేంద్రాల ద్వారా 25,84,928 క్వింటాళ్ల సేకరణను లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో సన్న రకాలు 18,53,370 క్వింటాళ్లు, 7,31,558 క్వింటాళ్లు దొడ్డు రకం ఉన్నాయి. కేంద్రాలకు కావాల్సిన గన్నీ సంచులు సమకూరుస్తూనే, ధాన్యం నిల్వ చేసేందుకు గోదాంలు సిద్ధం చేస్తున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధి రెండో జోన్‌లో ఉన్న జిల్లాలో ఈ నెలాఖరు నాటికే వరి కోతలు మొదలుకానున్నాయి. దీంతో వచ్చే నెల మొదటి వారం నుంచి కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.

2.10లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టుతో బోర్లు, బావులు, ఇతర నీటి వనరుల కింద 2,10,830 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో సన్న రకం 1,29,064 ఎకరాలు, దొడ్డు రకం 81,766 ఎకరాలు ఉన్నాయి. సన్నరకాలు క్వింటాకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వానాకాలం మాదిరిగానే యాసంగిలోనూ ఎక్కువగా సన్న రకాలే సాగు చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం సాగుతో అంతా కలిపి 54,51,516 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో మిల్లర్లు, వ్యాపారుల కొనుగోళ్లు, రైతులు అవసరాల కోసం పోగా మిగిలిన ధాన్యం కొనేలా పౌరసరఫరాల సంస్థ కసరత్తు చేస్తోంది. ఈమేరకు 25,84,928 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని భావిస్తుండగా, ఇందులో సన్నరకాల కోసమే ఎక్కువ కేంద్రాలు ఏర్పాటుచేసే అవకాశముంది.

సిద్ధంగా 19.39లక్షల గన్నీబ్యాగ్‌లు

ధాన్యం కొనుగోళ్లకు 64.62 లక్షల గన్నీ బ్యాగ్‌ల అవసరముండగా, ప్రస్తుతం 19.39 లక్షల బస్తాలు సిద్ధంగా ఉన్నాయి. మిగతా 45.23 లక్షల బ్యాగ్‌లను ఈ నెలాఖరు నాటికి సమకూర్చుకుంటారు. ఇందులో 20.74 లక్షల సంచులు కొత్తవి, మిగతావి ఉపయోగించినవి సిద్ధం చేస్తారు. కొనుగోళ్ల ఆధారంగా గన్నీల కొరత రాకుండా కేంద్రాలకు సరఫరా చేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

కొనుగోళ్ల వివరాలు..

ధాన్యం (అంచనా)	25,84,928 క్వింటాళ్లు
సన్న రకం	18,53,370 క్వింటాళ్లు
దొడ్డు రకం	7,31,558 క్వింటాళ్లు
కేంద్రాలు	344
అవసరమైన గన్నీ బ్యాగ్‌లు	64.62 లక్షలు
అందుబాటులో ఉన్నవి	19.39 లక్షలు

పీఏసీఎస్ కేంద్రాలే ఎక్కువ

జిల్లాలో మొత్తం 344 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. ఇందులో సన్న రకాల కోసం 282, దొడ్డు రకాల కోసం 62 కేంద్రాలు ఉంటాయి. వీటిలో ఐకేపీ 151, పీఏసీఎస్‌లు 162, డీసీఎంఎస్ 28, మెప్మా ఆధ్వర్యంలో మూడు కేంద్రాలను తెరుస్తారు. కాగా, ఐకేపీ ద్వారా ఏర్పాటుచేసే వాటిలో 60 కేంద్రాల్లో దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లే ఉంటాయి. కాగా, వచ్చే నెల 1 నుంచి జూన్ వరకు ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఉంటాయి.. ఎక్కడ కోతలు మొదలైతే అక్కడ తొలుత కొనుగోళ్లు ప్రారంభించేలా పౌరసరఫరాల సంస్థ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గతంలో ఏర్పాటుచేసిన కేంద్రాల స్థానంలో ఈసారి కూడా ఉంటాయని తెలిపారు.

ఏర్పాట్లు చేస్తున్నాం ..



జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. ఇటీవల హైదరాబాద్‌లో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. వచ్చే నెల 1నుంచి ధాన్యం కొనుగోళ్లు మొదలవుతాయి. ఏదైనా ప్రాంతంలో అంతకన్నా ముందే ధాన్యం వచ్చినా అక్కడి పరిస్థితులకు అనుగుణంగా కొనుగోళ్లు చేపడతాం.

– చందన్‌కుమార్, డీఎస్‌ఓ

‘సీతారామ’తో 8లక్షల ఎకరాలకు సాగునీరు

- ఈ నెలాఖరుకల్లా రైతులందరికీ భరోసా జమ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



టన్నెల్‌లో ట్రాక్టర్ నడుపుతూ వెళ్తున్న మంత్రి తుమ్మల, పక్కన భద్రాద్రి కలెక్టర్ పాటిల్, తదితరులు

సత్తుపల్లిటౌన్: రానున్న నాలుగేళ్లలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే తన లక్ష్యమని, తద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏడు నుంచి ఎనిమిది లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందుతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీతారామ ప్రాజెక్టులో భాగమైన సత్తుపల్లి మండలం యాతాలకుంటలోని ట్రంక్ టన్నెల్ పనులను గురువారం ఆయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి.పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఈక్రమంలో టన్నెల్‌లోకి మంత్రి తుమ్మల స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ వెళ్లి పనులను పరిశీలించాక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి ట్రంక్ పూర్తయితే ఉగాదికల్లా బేతుపల్లి చెరువు, లంకాసాగర్ ప్రాజెక్టులోకి గోదావరి జలాలు చేరతాయని, తద్వారా సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో రెండు లక్షల ఎకరాలకు నీరు అందుతుందని చెప్పారు. జిల్లా యంత్రాంగానికి ప్రజల సహకారం.. ఆపై శ్రీరామచంద్రుడి దయతో పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. భద్రాద్రి జిల్లాలో జూలూరుపాడు టన్నెల్ భూసేకరణ, అటవీ అనుమతుల కోసం కలెక్టర్ చొరవ చూపితే పాలేరుకు సైతం గోదావరి జలాలు చేరతాయన్నారు. ఇద్దరు కలెక్టర్లు కష్టపడుతూనే మనస్సు పెట్టి పనిచేస్తున్నారని మంత్రి కితాబిచ్చారు.

సంప్రదాయ పంటలు వద్దు..

నీళ్ల విలువ రైతులకే ఎక్కువగా తెలుస్తుందని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఈమేరకు సంప్రదాయ పంటలు కాకుండా ఆయిల్‌పామ్ వంటివి సాగు చేస్తే రైతులు రాజుల్లా బతకవచ్చన్నారు. ఉపాధిహామీ పథకంతో ఉచితంగా నీటి గుంతలు తవ్విస్తున్నందున రైతులు ముందుకు రావాలని సూచించారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ రైతులు అవగాహనతో లాభదాయక వ్యవసాయం చేస్తే వారి కుటుంబాలు ఆర్థికంగా బాగు పడతాయని తెలిపారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎస్ఈలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసాచారి, మార్కెట్ చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, భాగం నీరజాచౌదరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రాజేశ్వరి, ఎఫ్‌డీఓ మంజులతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, డాక్టర్ మట్టా దయానంద్, సాధు రమేష్‌రెడ్డి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, చల్లగుళ్ల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే భరోసా, బోనస్

రైతులందరికీ రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.10వేల కోట్లు ఈనెలాఖరు నాటికి జమ చేస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఖజానాలో నిల్వలు లేనప్పటికీ అప్పోసప్పో చేసైనా నిధులు విడుదల చేస్తామన్నారు. అలాగే, సన్నధాన్యం అమ్మిన రైతులకు రూ.1,100 కోట్ల బోనస్‌కు గాను ఇప్పటి వరకు రూ.900 కోట్లు చెల్లించామని, మిగతావి సైతం త్వరలో అందిస్తామన్నారు. ఇక ఖమ్మం-రాజమండ్రి గ్రీన్‌ఫీల్డ్ హైవే ఆగస్టు 15 కల్లా ఈ రహదారి అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. బుగ్గపాడు ఫుడ్‌పార్కులో మరో రెండు పరిశ్రమలు ఏర్పాటు కానుండగా, ఉగాది నాటికి కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు.

ఖమ్మం స్టేషన్ ముఖద్వారం మోడల్



అత్యాధునికంగా ఖమ్మం స్టేషన్ !

వేగంగా ఆధునికీకరణ పనులు

ఖమ్మం రాపర్తినగర్: అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన ఖమ్మం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఈ స్టేషన్‌లో ముఖద్వారం, ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ, లిఫ్ట్‌లు, ఎస్కలేటర్ల ఏర్పాటు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.25.41 కోట్లు కేటాయించగా ఇప్పటికే 45 శాతం మేర పనులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. కొద్దినెలల్లో పనులు పూర్తికానుండగా స్టేషన్ కొత్తరూపు సంతరించుకునే అవకాశముంది. కాగా, ఒకేసారి రెండు రైళ్లు వచ్చినా సాఫీగా రాకపోకలు జరిగేందుకు రెండు మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఆఖరు దశకు చేరాయని, రెండేసి లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫాం పొడిగింపు, దివ్యాంగుల కోసం కొత్త టాయిలెట్ బ్లాక్ నిర్మాణం, వెయిటింగ్ హాల్ నిర్మాణం కూడా పూర్తికావొస్తున్నాయి.



రెండు మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ర్యాంప్, ఎఫ్‌ఓబీ

పండితాపురం సంత వేలం మరోసారి..

- రూ.2.35కోట్ల వరకు కొనసాగిన పాట
- ప్రభుత్వ మద్దతు ధర రాక వాయిదా



వేలంను పర్యవేక్షిస్తున్న డీపీఓ ఆశాలత

కామేపల్లి: రాష్ట్రంలోనే పేరున్న మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధి శ్రీ కృష్ణప్రసాద్ సంత నిర్వహణను అప్పగించేందుకు నిర్వహించిన వేలంలో ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో పాటను రద్దు చేశారు. జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్ అధ్యక్షతన గురువారం వేలం పాట నిర్వహించగా బోడా శ్రీను, భూక్యా వీరన్న, బానోత్ శంకర్, భూక్యా నాగేంద్ర బాబు ధరావత్తు, సాల్వెన్సీగా రూ.35లక్షల చొప్పున చెల్లించారు. సాయంత్రం 4గంటల వరకు హోరాహోరీగా సాగిన వేలంలో చివరకు రూ.2,35,70,000తో హెచ్చు పాటదారుడిగా బోడా శ్రీను నిలిచాడు. అయితే, ప్రభుత్వ మద్దతు రాకపోవడంతో రద్దు చేసిన అధికారులు తిరిగి ఈనెల 17న మరోమారు వేలం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు మొదటి, రెండు స్థానాల్లో ఉన్న బోడా శ్రీను, భూక్యా వీరన్న చెల్లించిన ధరావత్తు, సాల్వెన్సీ సొమ్మును జీపీ అధికారులు ఆధీనంలోకి తీసుకోగా, మిగతా వారి నగదు చెల్లించారు. అయితే, ప్రభుత్వ మద్దతు ధర ఎంత అనేది మాత్రం బయటపెట్టలేదు. వేలం పాటను జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు పర్యవేక్షించగా ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీఓలు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

మా గోడు పట్టించుకునేదెవరు?

మేయర్, కమిషనర్ ఎదుట కార్పొరేటర్ల ఆవేదన

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే తమకు అధికారులు సహకరించడం లేదని.. ఇదిలాగే కొనసాగితే ఇబ్బంది ఎదురవుతుందని పలువురు కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొద్దిరోజులుగా కేఎంసీ అధికారుల తీరుపై ఆగ్రహంగా ఉన్న కార్పొరేటర్లు విషయాన్ని మేయర్ పునుకొల్లు నీరజ దృష్టి కి తీసుకెళ్లగా ఆమె, కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. పారిశుద్ధ్యం. తాగునీటి సమస్యలపై ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఆన్‌లైన్‌లో వచ్చే సమస్యలకే ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పినట్లు సమాచారం. దీంతో డివిజన్ల వారీగా అధికారులను కేటాయించి కార్పొరేటర్లకు తెలియచేస్తామని, అదనంగా కార్మికులను సమకూరుస్తామని కమిషనర్ చెప్పడంతో శాంతించినట్లు తెలిసింది.

చిన్నారులకు కంటి పరీక్షలు పూర్తి

3,083మందికి అద్దాలు అవసరమని గుర్తింపు

ఖమ్మంవైద్యవిభాగం: వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలు వంద శాతం పూర్తయ్యాయి. జిల్లాలో 3,433మందికి పరీక్షలు చేయగా, 3,083 మందికి అద్దాలు అవసరమని గుర్తించారు. ఇంకో పది మందిని హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. వీరిలో నలుగురు మెల్ల కన్ను, శుక్లాలు, ఆరుగురు కార్నియాతో బాధపడుతున్నారని జిల్లా బ్లైండ్‌నెస్ కంట్రోల్ ఆఫీసర్ రామూనాయక్ తెలిపారు. గత ఏడాది 5–10వ తరగతుల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 3,433మందికి సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీంతో వీరికి గతనెల 17నుంచి రెండో దఫా పరీక్షలు నిర్వహించారు.

పరీక్షలు ఇలా...

ఖమ్మం ఆస్పత్రిలో 2,407 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 2,079 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ఎనిమిది మందికి సరోజినీదేవీ కంటి వైద్యశాలకు రిఫర్ చేశారు. మిగతా వారికి సమస్య లేదని తేల్చారు. నేలకొండపల్లి సీహెచ్‌సీలో 464 మందికి పరీక్షలు చేయగా, 442 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, ఇద్దరిని రిఫర్ చేశారు. సత్తుపల్లిలో 562 మందికి పరీక్షలు నిర్వహించగా అందరికీ కంటి అద్దాలు అవసరమని తేల్చారు.

తాగు, సాగునీటికి ఇబ్బందులు రావొద్దు

- చివరి ఆయకట్టు వరకు సాఫీగా నీటి సరఫరా
- పాలేరు రిజర్వాయర్‌తో పాటు పంటలు పరిశీలించిన కలెక్టర్



బాలల సదనం పిల్లలకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మహిళా దినోత్సవంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

ఖమ్మం రూరల్/కూసుమంచి: వేసవికాలం మొదలైనందున తాగు, సాగు నీటికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల్లో కలెక్టర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన ఆయన నీటిమట్టం, సాగర్ నుండి వస్తున్న నీటి వివరాలు ఆరా తీయడంతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులకు సూచనలు చేశారు. వారబందీ విధానంలో నీరు విడుదల చేస్తూనే మధ్యలో ఎక్కడా వృథా కాకుండా చూడాలని, తద్వారా చివరి ఆయకట్టుకు చేర్చాలని తెలిపారు. సాగునీటి విడుదల, ఆపే విషయమై రైతులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అలాగే, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడులో పంటలను పరిశీలించిన కలెక్టర్ సాగునీటి సమస్యపై రైతులతో మాట్లాడారు. తల్లంపాడు కాల్వగట్టు నుండి యడవల్లి వరకు బైక్‌పై వెళ్లిన కలెక్టర్ అక్కడ మిర్చి, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. సాగర్ ఆయకట్టులో ఎకరం కూడా ఎండిపోకుండా అధికారులు పర్యవేక్షించాలని, పంట కోతలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తహసీల్దార్ కరుణశ్రీ, ఇరిగేషన్ డీఈఈ మధు, ఏడీఏ సరిత, ఏఓ వాణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి చర్యలు

ఖమ్మంవన్‌టౌన్: బాలల సదనంలో ఉంటున్న పిల్లల సమగ్రాభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. బాలల సదనం పిల్లలను కలెక్టరేట్‌కు తీసుకురాగా ఆయన చదువు, ఇతర వివరాలు తెలుసుకున్నారు. పిల్లలను క్యాంటీన్‌కు తీసుకుని వెళ్లి స్వయంగా భోజనం వడ్డించారు. ఇటీవల వండర్ లాకు వెళ్లివచ్చిన పిల్లల అనుభవాలు తెలుసుకోవడమే కాక బాలల సదనంలో కంప్యూటర్లు సమకూర్చాలని, పర్యాటక ప్రదేశాలతో పాటు టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్‌కు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, అడిషనల్ డీఆర్డీఓ నూరుద్దీన్, డీసీపీయూ విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు

ఖమ్మం సహకారనగర్: మహిళలను గౌరవిస్తూ వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలోఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళా అధికారులు, ఉద్యోగులు అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నారన్నారు. తల్లిదండ్రులు సైతం అమ్మాయిలపై వివక్ష చూపకుండా అబ్బాయిలతో సమానంగా చదివించాలని తెలిపారు. కాగా, కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులు వారి ఇంటి పరిసరాల్లో ఎవరికైనా ఆడపిల్ల పుడితే స్వీట్ బాక్స్‌తో వెళ్లి అభినందనలు తెలపాలన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ కళావతిబాయి తదితరులు మాట్లాడగా బాల సదనం చిన్నారులు, పలు కళాశాలల విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే, చదువు, క్రీడల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్థినులు, ఎన్‌సీసీ కేడెట్లు, మహిళా ఉద్యోగులకు డీఆర్వో పద్మశ్రీ జ్ఞాపికలు అందజేశారు. ఆతర్వాత బేటీ బచావో, బేటీ పడావో పోస్టర్లను ఆవిష్కరించారు. డీడబ్ల్యూఓ కెరాంగోపాల్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు విష్ణు వందన, సబ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

■ రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్-4 టీచర్ ఉపవాణి బెస్ట్ టీచర్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఆమెకు డీడబ్ల్యూఓ జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేశారు.

అంబులెన్స్ ప్రారంభం

ఖమ్మంవైద్యవిభాగం: మారుమూల ప్రాంతాల ప్రజలకు సత్వరమే వైద్యసేవలు అందేలా ఆర్ఐఎన్ఎల్ సంస్థ బాధ్యులు కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా ఆర్ అంబులెన్స్ అందజేశారు. కామేపల్లి, కారేపల్లి ప్రాంత వాసుల కోసం సమకూర్చిన ఈ అంబులెన్స్ పత్రాలను కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అందించగా ఆయన కొద్దిదూరం వాహనం నడిపారు. మాధారం డోలమైట్ మైన్స్ డీజీఎం, ఇన్‌చార్జ్ బీ.యూ.వీ.ఎస్.రాజు మాట్లాడగా డీఎంహెచ్ఓ కళావతిబాయి, ఆర్ ఐఎన్ఎల్ ఉద్యోగి పి.చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'వికసిత్ భారత్' గడువు పొడిగింపు

ఖమ్మం రాపర్తినగర్: వికసిత్ భారత్ ద్వారా నిర్వహించే యువ పార్లమెంట్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు ఎన్వైకే జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్ సింగ్, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కమిటీ నిర్వాహకులు డాక్టర్ కే.వీ.రమణరావు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు రూపొందించిన ఒక్క నిమిషం వీడియోను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ పోటీలు 19వ తేదీన ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో జరుగుతాయని తెలిపారు.

మందులు, సామగ్రి సరఫరాకు టెండర్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అవసరమైన మందులు, ఇతర సామగ్రి సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. మందులతో పాటు శస్త్ర చికిత్సలకు అవసరమైన సామగ్రి, ప్రయోగశాలలో రసాయనాలు, ఆర్థో ఇంప్లాంట్లు, క్యాథ్ ల్యాబ్ ఇంప్లాంట్లను రెండేళ్ల పాటు సరఫరా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఏజెన్సీలు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పేరుతో రూ.10వేల డీడీ లేదా చెక్కు అందజేసి ఈనెల 20 టెండర్ దరఖాస్తు తీసుకోవచ్చని, పూర్తిచేశాక ఏప్రిల్ 11వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా అందజేయాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న మల్లెమడుగు విద్యార్థులు

ఖమ్మంఅర్బన్/ముదిగొండ: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న జిల్లా జట్టులో ఖమ్మం మల్లెమడుగు, ముదిగొండ మండలం మేడేపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు స్థానం దక్కింది. మల్లెమడుగు పాఠశాల విద్యార్థులు శ్రీవాణి, పల్లవి, జానీ, మోహనకృష్ణతో పాటు మేడపల్లి జెడ్పీహెచ్ఎస్ నుంచి కీర్తి, మణిదీప్‌చంద్ర, తనుశ్రీ, ధోని ఎంపికయ్యారు. వనపర్తిలో మంగళవారం మొదలుకానున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వీరు బయలుదేరారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంలు కృష్ణవేణి, బి.నాగేశ్వరరావు, అమ్మ ఆదర్శ పాఠశాలల అధ్యక్షులు ఝాన్సీ, అలివేలి, ఝాన్సీ, కార్పొరేటర్లు లలితారాణి, నిరంజన్, పీడీ బి.కృష్ణయ్యతో పాటు కృష్ణమూర్తి, సూర్యం, కృష్ణ, తిరుపతిరావు, శ్రీనివాసరావు, జానీమియా, వెంకటేశ్వర్లు, బట్టపోతుల సతీష్, వైకుంఠాచారి తదితరులు అభినందించారు.

భూనిర్వాసితులకు ఇళ్ల పట్టాలు


పట్టాలు అందుకున్న వారితో మేయర్, తదితరులు

ఖమ్మం మయూరిసెంటర్: కేఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, విస్తరణకు ఇళ్లు, ఇంటి స్థలాలు సేకరించారు. ఈమేరకు నిర్వాసితులు ఐదుగురికి మేయర్ పి.నీరజ గురువారం ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కేఎంసీ అధికారులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన జారీ చేసిన చెక్కు చెల్లకపోవడంతో సదరు వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం మద్యపాన నిషేధ, ఆబ్కారీ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత గురువారం తీర్పు చెప్పారు. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన బి.వెంకటేశ్వరరావు వద్ద ఖమ్మంకే చెందిన కె.గోపీ రవీంద్రనాథ్ కుమార్ 2016 మే నెలలో రూ.2లక్షల అప్పు తీసుకున్నాడు. అనంతరం అప్పు చెల్లించే సమయంలో జారీ చేసిన చెక్కును బ్యాంకు జమచేస్తే సరిపడా నగదు లేక బౌన్స్ అయింది. ఈమేరకు న్యాయవాది చుంచుల మల్లికార్జునరావు ద్వారా వెంకటేశ్వరరావు కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం రవీంద్రనాథ్ కుమార్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.2లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదం కేసులో...

ఖమ్మం లీగల్: రోడ్డు ప్రమాదానికి కారకుడైన వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం న్యాయమూర్తి బెక్కం రజిని గురువారం తీర్పు వెల్లడించారు. 2021 జనవరి 9న ఖమ్మం చైతన్యనగర్‌లో నడిచి వెళ్తున్న పోలూరి శ్రీనివాసరావును పావురాల వెంకటనారాయణ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన శ్రీనివాసరావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పోలీసులు కేసు విచారణ అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. ఈమేరకు వెంకటనారాయణపై నేరం రుజువు కావడంతో మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పిటీషనర్ తరఫున ఏపీపీ డి.వీరయ్య వాదించగా, కానిస్టేబుల్ మత్తయ్య సహకరించారు.

పూర్వ వీఆర్‌ఓల్లో ఆశలు

- ఉగాది నాటికి 'భూభారతి'
- తద్వారా సొంత శాఖలోకి తీసుకుంటారని ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో 562మంది ఎదురుచూపులు


సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఆందోళనల్లో వీఆర్‌ఓలు (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. దీంతో మళ్లీ తాము సొంత శాఖ అయిన రెవెన్యూలోకి వెళ్తామని పూర్వ వీఆర్వోల్లో ఆశలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వం నవంబర్ 19, 2020న వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి 2022 జూలై 23న వీఆర్వోలను ఇతర శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో సర్దుబాటు చేసింది. ఆ సమయాన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీ లేక.. జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కలిగిన వీఆర్వోలను అటెండర్, స్వీపర్, కామాటి, కుక్, తోటమాలి, జీపు డ్రైవర్, రికార్డు కీపర్, రికార్డ్ అసిస్టెంట్, వార్డు అధికారి, సీనియర్ స్టెనో, జూనియర్ స్టెనో తదితర పోస్టుల్లో సర్దుబాటు చేశారు. అయితే, సరైన స్థాయి పోస్టులు లేక, ఆశించిన గౌరవం కూడా లభించటం లేదని వారు ఆవేదన చెందుతున్నారు.

మళ్లీ ఇన్నాళ్లకు...

కొత్త ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొస్తామని చెబుతుండగా, పూర్వ వీఆర్వోలు ఆశలు రెకేత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11వేల పోస్టులు భర్తీ చేస్తామని చెబుతున్న క్రమంలో పూర్వ వీఆర్వోలు 5వేల మందిని ఈ పోస్టుల్లోకి తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఫలితంగా పూర్వ వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోనుండగా, ఇంకొందరు నిరుద్యోగులకూ ఉద్యోగావకాశాలు దక్కే అవకాశముంది.

ఏం పేరు?

రాష్ట్రప్రభుత్వం భూభారతిలో విధులు నిర్వర్తించే వారికి గ్రామ పరిపాలన అధికారి(జీపీఏ) లేదా విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(వీఏఓ)గా పేరు పెట్టే అవకాశముందని రెవెన్యూ వర్గాల ద్వారా తెలిసింది. ఉగాది నాటికి స్పష్టత వచ్చే అవకాశముంది.

ఉమ్మడి జిల్లాలో గ్రామాలు, వీఆర్వోల వివరాలు

జిల్లా	మండలాలు	రెవెన్యూ గ్రామాలు	వీఆర్వోలు
ఖమ్మం	21	352	329
భద్రాద్రి	23	240	233
మొత్తం	44	592	562

అయితే, గ్రామస్థాయిలో వీఆర్వోలు కీలకం కానున్నందున జీపీఏనే పేరు ఖరారు చేసే అవకాశముందని చెబుతున్నారు.

ఈ సమస్యలూ పరిష్కరిస్తే...

తమను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడంతో సర్వీస్ రక్షణతో పాటు పదోన్నతులు కోల్పోయామని వీఆర్వోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇంక్రిమెంట్లు కోల్పోయామని, నేటికీ సర్వీస్ క్రమబద్ధీకరణ జరగలేదని, ప్రొబేషనరీ పీరియడ్ ఖరారు చేయడం లేదనే వాదన ఉంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జీసీసీలో సేల్స్‌మెన్లుగా, పెట్రోల్ బంక్ ఆపరేటర్లుగా కేటాయించిన 16మందికి వేతనాలు అందడం లేదని చెబుతున్నారు. అంతేకాక ఇద్దరు వీఆర్వోలు మృతి చెందడంతో కారుణ్య నియామకాల్లోనూ అవకాశం ఇవ్వలేదని ఆవేదన చెందుతున్నారు. కాగా, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఇటీవల రెవెన్యూ అసోసియేషన్‌తో కలిసి పూర్వ వీఆర్వోలు సమావేశమయ్యారు. భూభారతిలో అవకాశం కల్పించడమే కాక ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆయనను కోరారు.

సీనియారిటీతో పదోన్నతులు



రాష్ట్ర ప్రభుత్వం భూభారతిని తీసుకొచ్చి అప్పగించే ప్రతీ పనిని బాధ్యతగా చేస్తాం. అయితే, మా సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు వర్తింపచేయాలి. ప్రతీ గ్రామానికి ఒక సహాయకుడిని నియమిస్తే క్షేత్రస్థాయిలో సులువుగా పాలన సాగుతుంది.

– గరికె ఉపేంద్రరావు, వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వేతనాలు అందడం లేదు



వీఆర్వో వ్యవస్థ రద్దయ్యాక నన్ను గిరిజన కార్పొరేషన్ సొసైటీ(జీసీసీ)కి కేటాయించారు. ప్రభుత్వం 60శాతం, కార్పొరేషన్ 40శాతం నిధులతో వేతనం ఇవ్వాలి. కానీ సక్రమంగా వేతనాలు అందక ఇబ్బందిగా ఉంది. ఇతర శాఖల్లో మాదిరి కార్పొరేషన్‌లో పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్లు సౌకర్యాలు అందడం లేదు.

– మట్టా వెంకటమ్మ, జీసీసీ ఉద్యోగి, మణుగూరు

దీక్షలు విరమించండి.. సీఎండీకి నివేదిస్తా

సైలోబంకర్ బాధితులతో సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు


సింగరేణి డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సైలోబంకర్ బాధితులు

సత్తుపల్లి: సైలో బంకర్‌తో స్థానికులకు ఎదురవుతున్న సమస్యలు తమ దృష్టిలో ఉన్నందున దీక్షలు విరమిస్తే ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కిష్టారం అంబేద్కర్‌నగర్‌లో సైలో బంకర్‌కు వ్యతిరేకంగా 30రోజులుగా జరుగుతున్న నిరాహార దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. స్థానికులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులను సింగరేణి సీఎండీ బలరాంనాయక్ దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం లభించేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ సైలోబంకర్ సమస్యను ఎమ్మెల్యే రాగమయి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతో పాటు అసెంబ్లీలో ప్రస్తావించారరని తెలిపారు. ప్రజల ఆవేదనపై ప్రభుత్వంతోనైనా గట్టిగా చర్చించనున్నందున తమపై నమ్మకంతో దీక్షలు విరమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జీఎం షాలేం రాజు, పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సైతం సైలో బంకర్ బాధితులు కలిశారు. సమస్యపై సింగరేణి సీఎండీతో కలిసి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులం మాట్లాడతామని, అయినా ఫలితం లేకపోతే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఈమేరకు దీక్షలను విరమించాలని ఆయన సూచించగా, చర్చించుకుని శనివారం చెబుతామని అటు సింగరేణి డైరెక్టర్, ఇటు మంత్రికి అంబేద్కర్‌నగర్ కాలనీవాసులు బదులిచ్చారు.

గ్రూప్–1, 2 ఫలితాల్లో సూర్యతండా వాసి ప్రతిభ


భువనేశ్వర్

కారేపల్లి: ఇటీవల విడుదలైన గ్రూప్–1, 2 ఫలితాల్లో కారేపల్లి మండలం సూర్యతండా గ్రామానికి చెందిన బాధావత్ భువనేశ్వర్ ప్రతిభ చాటాడు. గ్రూప్–1లో 432 మార్కులు సాధించగా, గ్రూప్–2లో 376 మార్కులతో రాష్ట్రస్థాయి 322, జోనల్ స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించాడు. కాగా, ఇప్పటికే గ్రూప్–4లో ప్రతిభ చాటిన ఆయన జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూనే ఇప్పుడు గ్రూప్–1, 2కు ఎంపికవడంపై పలువురు అభినందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాదావత్ లక్ష్మణ్–సరోజ కుమారుడైన భువనేశ్వర్ తల్లి ఆయన చిన్నతనంలోనే మృతి చెందింది. దీంతో మేనమామ, 2017లో గ్రూప్–1కు ఎంపికై జిల్లా ఆడిట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న బానోతు రాము ప్రోత్సాహంతో చదివి ఉద్యోగ పరీక్షలకు సిద్ధమయ్యాడు.

పట్టుబట్టి కొలువు కొట్టి..


సుధాకర్

మధిర: మండలంలోని దేశినేనిపాలెంకు చెందిన మందలపు సుధాకర్ గ్రూప్–2లో రాష్ట్రస్థాయిలో 74వ ర్యాంకుతో సత్తా చాటాడు. రైతు కుటుంబానికి చెందిన ఆయన ఇప్పటికే గ్రూప్–4 ద్వారా ఉద్యోగం సాధించి ఖమ్మం కార్పొరేషన్లో వార్డు ఆఫీసర్గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇప్పుడు గ్రూప్–2లోనూ ప్రతిభచాటిన సుధాకర్ ఇంటర్మీడియట్ మధిర శ్రీనిధి జూనియర్ కళాశాలలో, బీటెక్ హైదరాబాదులో పూర్తి చేశాడు. తల్లిదండ్రుల సహకారంతో కష్టపడి చదివిన తాను, ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తేనే జీవితానికి భరోసా అని నమ్మానని తెలిపాడు.

వచ్చే ఏడాది అన్ని స్కూళ్లలో ఏఐ


విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న డీఈఓ

నేలకొండపల్లి/ముదిగొండ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ఆధారిత బోధన ప్రారంభిస్తామని జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. నేలకొండపల్లిలోని సింగారెడ్డిపాలెం పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన ఏఐ ఆధారితో బోధన, విద్యార్థులను సామర్థ్యలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం ఏడు పాఠశాలల్లో ఈ బోధన ప్రారంభించగా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. దీంతో వచ్చే ఏడాది అన్ని పాఠశాలల్లో మొదలుపెడతామని చెప్పారు. కాగా, ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 97 కేంద్రాలు ఏర్పాటుచేయగా 16,500 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. కాగా, ముదిగొండ మండలం బాణాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించగా విద్యార్థులకు టీఎల్ఎం మేళా, ప్రతిభాపాటవ, సాంస్కృతిక అంశాల్లో పోటీలు జరిగాయి. ఈ మేరకు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఇ.వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో డీఈఓ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను వివరిస్తూ ప్రవేశాల సంఖ్య పెంచాలన్నారు. కాగా, పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎగ్జామినేషన్ బోర్డు అసిస్టెంట్ కమిషనర్ గోపగాని రమేష్, ఏఎంఓ రవికుమార్, ఓపెన్ స్కూల్ జిల్లా కోర్డినేటర్ మద్దినేని పాపారావు, ఎంఈఓలు బి.చలపతిరావు, రమణయ్య, హెచ్‌ఎంలు హరి శ్రీనివాస్, వెంకట్రాంరెడ్డి, కె.శాంతి, ఖాదర్, శ్రీను, సుబ్బారావు, పద్మావతి తదతరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న హెచ్‌ఎం మృతి


అగ్గి రవి (ఫైల్)

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని వెంగళరావునగర్ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడు అగ్గి రవి (42) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటకు చెందిన ఆయన ప్రస్తుతం భీమునిగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. సత్తుపల్లి నుంచి రాకపోకలు సాగిస్తుండగా ద్విచక్ర వాహనంపై ఎర్రగుంటకు వెళ్లే క్రమాన జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో రవిని ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన భార్య కవిత దమ్మపేట మండలం మొండివర్రె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, రవి సోదరుడు కూడా గతంలో రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందినట్లు తెలిసింది.

108 అంబులెన్స్ నడుపుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



అంబులెన్స్ నడిపి.. బైక్‌పై వెళ్లి!

మాదారం డోలమైట్ మైన్స్ బాధ్యులు సీఎస్ఆర్‌లో భాగంగా 108 వాహనాన్ని సమకూర్చారు. ఈ వాహనాన్ని కలెక్టరేట్‌లో అందజేయగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కాసేపు నడిపారు. ఇక ఖమ్మం రూరల్ మండలంలో పంటల పరిశీలనకు వెళ్లిన కలెక్టర్.. అక్కడ తల్లంపాడు కాల్వ గట్టు నుండి యడవల్లి వరకు వాహనం వెళ్లే మార్గం లేక బైక్‌పై ప్రయాణించారు.

– ఖమ్మం వైద్యవిభాగం/ ఖమ్మం రూరల్


పంటల పరిశీలనకు బైక్‌పై వెళ్తూ..

500 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దపల్లి జిల్లాకు తరలించే క్రమాన సీజ్


పట్టుబడిన లారీలు, డ్రైవర్లతో సివిల్ సప్లయిస్ అధికారులు

కొణిజర్ల: అక్రమంగా తరలిస్తున్న సుమారు 500 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయిస్ అధికారులు కొణిజర్ల మండలం తనికెళ్లలో స్వాధీనం చేసుకున్నారు. తనికెళ్లలోని ఓ దాబా సమీపాన గురువారం రెండు లారీలు నిలిపారనే సమాచారంతో సివిల్ సప్లయిస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీలు అంజయ్య, యాదయ్య, సీఐ వసంత్‌కుమార్ చేరుకుని తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు తేలింది. దీంతో రెండు లారీలను కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఓ లారీ డ్రైవర్, ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన గజరావు గోపీ ఏన్కూరు సమీపాన బొలేరో వాహనాల ద్వారా తీసుకొచ్చిన 485 సంచుల బియ్యాన్ని లారీలో లోడ్ చేశాడని తేలింది. అలాగే, మరో డ్రైవర్ ఖమ్మం ప్రకాశ్‌నగర్‌కు చెందిన బి.రాము అదే ప్రాంతం నుంచి 600 సంచుల్లో తరలిస్తుండగా, పెద్దపల్లి జిల్లాకు తీసుకెళ్లాలన్న సమాచారంతో తనికెళ్ల సమీపంలోని దాబాకు వద్దకు చేరుకున్నామని అంగీకరించారు. అయితే, డ్రైవర్ల వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో లారీలను సీజ్ చేశారు. అనంతరం సివిల్ సప్లయిస్ డీటీ ఎం.వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు. తనిఖీల్లో ఆర్ఐ కిరణ్‌కుమార్, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిప్పంటించడంతో విరిగిపడిన చెట్టు

విద్యుత్ స్తంభంపై పడడంతో సరఫరాకు అంతరాయం


కాలి పడిపోయిన భారీ వృక్షం కొమ్మ

తల్లాడ: మండలంలోని లక్ష్మీనగర్ గ్రామ సమీపాన భారీ వృక్షం మొదట్లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా అది కాలిపోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో 33 కేవీ లైన్ తెగి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బుధవారం రాత్రి భారీ వృక్షం మొదట్లో నిప్పు పెట్టగా కాలుతూ పెద్ద కొమ్మ విరిగి పక్కనే ఉన్న స్తంభంపై పడినట్లు తెలుస్తోంది. ఈక్రమాన మరో రెండు స్తంభాలు కూడా ఒరిగిపోయాయి. ఈమేరకు వైరా అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పగా, విద్యుత్ శాఖాధికారులు మరో లైన్ నుంచి సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ ఏఈ రాయల ప్రసాద్ మాట్లాడుతూ చెట్లు, పొలాల్లో నిప్పు పెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని గుర్తించాలని తెలిపారు.

అదనపు సమాచారం కోసం ఆరా

లింగ నిర్ధారణ పరీక్షల కేసులో విచారణ

చింతకాని: నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ముగ్గురితో కూడిన ముఠా పోలీసులకు పట్టుబడగా, ప్రధాన నిందితుడైన ఖమ్మం బల్లేపల్లికి చెందిన సల్లోజు వెంకటేష్ అలియాస్ చారి విచారణ కొనసాగుతోంది. కారులో యంత్రంతో గ్రామాలకు వెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఈ ముఠాను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేశారు. బల్లేపల్లికి చెందిన చారి, చింతకాని మండలం కొదుమూరుకు రాచబంటి మనోజ్, ఖమ్మంకు చెందిన అల్లీపురం కాత్యాయని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో గర్భిణులైన గిరిజన మహిళలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు గుర్తించారు. గత నెల 27వ తేదీన కొదుమూరులో ముగ్గురు మహిళలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తుండగా , కాత్యాయినిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అచేయగా, ప్రధాన నిందితుడిడైన చారి గత శనివారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో ఏయే ప్రాంతాల్లో ఎందరు గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేశారు, ఎవరికైనా గర్భస్రావం చేయించారా, ఇందులో ఎవరెవరి పాత్ర ఉందనే అనే కోణంలో చారిని విచారిస్తున్నట్లు సమాచారం.

వివాహ ఊరేగింపులో రాళ్ల దాడులు

- చిన్నారి సహా ఆరుగురికి గాయాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఎనిమిదో డివిజన్ గోపాలపురంలో బుధవారం అర్ధరాత్రి ఓ పెళ్లి ఊరేగింపు సందర్భంగా నృత్యం చేసే సమయాన మొదలైన వివాదం పెరిగి రాళ్ల దాడులకు దారి తీసింది. ఊరేగింపు జరుగుతుండగా పెళ్లి కుమారుడి తరఫున వచ్చిన యువకులు కొందరు మద్యం మత్తులో మహిళలను దూషించడంతో అమ్మాయి తరఫు వారు ప్రశ్నించారు. దీంతో మద్యం మత్తులో ఉన్న రామ్, విజయ్, నజీర్, నవీన్, బన్నీ, సునీల్, భరత్, గణేష్, అమర్, వీరన్న తదితరులు ఇంకొందరితో వచ్చి రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు కాగా, మోక్షిత అనే బాలిక తలకు తీవ్ర గాయమైంది. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. అయితే, విజయ్ అనే యువకుడి తీరుతో ఘర్షణ మొదలైనట్లు తెలిసిందని, బాధితుల ఫిర్యాదుతో పది మందిపై కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ఆయిల్‌పామ్ గెలలు చోరీ

సత్తుపల్లిరూరల్: తోటలో కోతలకు వచ్చిన ఆయిల్‌పామ్ గెలలను బుధవారం అర్ధరాత్రి చోరీ చేసి ఆటోలో తీసుకెళ్తుండగా దొంగలను సత్తుపల్లి మండలం నారాయణపురం, కిష్టాపురం గ్రామాల రైతులు అడ్డుకున్నారు. అయితే, మండలంలోని ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఆయిల్‌పామ్ గెలలను డ్రైవర్ కారుమంచి సాయికుమార్ పడవేయడంతో తాను తీసుకెళ్తున్నట్లు ఆటోలోని వ్యక్తి చెప్పినట్లు తెలిసింది. ఈమేరకు ఆటోతో పాటు సదరు వ్యక్తిని నిర్బంధించిన స్థానికులు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.